సాక్షి
మంచిర్యాల
శనివారం। 12। అక్టోబర్। 2024



బెల్లంపల్లిలో దుర్గాదేవి ప్రతిరూపాలుగా బాలికల వేషధారణ

దుర్గమాతకు ఘనంగా పూజలు 7లో

న్యూస్‌రీల్

సభాస్థలం పరిశీలించిన సీపీ



ఏర్పాట్లపై సూచనలు చేస్తున్న రామగుండం సీపీ శ్రీనివాసులు

కాసిపేట: కాసిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని కల్వరి మినిస్ట్రీ సభా స్థలాన్ని రామగుండం పోలీసు కమిషనర్ శ్రీనివాసులు శుక్రవారం పరిశీలించారు. కల్వరి చర్చి ఆధ్వర్యంలో ఈ నెల 16, 17వ తేదీల్లో 50 రోజుల ఉపవాస దీక్ష విరమణ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ఇతర రాష్ట్రాలు, ప్రాంతాల నుంచి భక్తులు సుమారు లక్షకుపైగా హాజరుకానుండడంతో ప్రాంగణం, ఏర్పాట్లు పరిశీలించారు. పార్కింగ్ స్థలాలు, సభ, భోజన ఏర్పాట్ల ప్రాంతాలను పరిశీలించి అధికారులు, నిర్వాహకులను అడిగి తెలుసుకుని మ్యాప్ పరిశీలించారు. వాహనదారులు, ప్రజలకు ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. బందోబస్తు ఏర్పాట్లపై అధికారులకు సలహాలు, సూచనలు చేశారు. ఆయన వెంట పెద్దపల్లి అడిషనల్ డీసీపీ(అడ్మిన్) రాజు, స్పెషల్ బ్రాంచి ఏసీపీ రాఘవేంద్రరావు, బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, ఏఆర్ ఏసీపీలు ప్రతాప్, సుందర్‌రావు, మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి, ఆర్ఐ వామనమూర్తి, కాసిపేట ఎస్సై ప్రవీణ్, చర్చి నిర్వాహకులు పాల్గొన్నారు.

ఫెన్సింగ్ ఎంపిక పోటీలు

మంచిర్యాలఅర్బన్: ఎస్జీఎఫ్ జిల్లా, జోనల్ స్థాయి ఫెన్సింగ్ ఎంపిక పోటీలు ఈ నెల 17న శ్రీరాంపూర్‌లోని సీఈఆర్ క్లబ్‌లో నిర్వహించనున్నట్లు ఎస్జీఎఫ్ ప్రధాన కార్యదర్శి ఫణిరాజా తెలిపారు. ఉమ్మడి జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్-14, 17 విభాగాల్లో పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. అర్హులైన క్రీడాకారులు ధ్రువీకరణ పత్రాలతో సీఈఆర్ క్లబ్‌లో వ్యాయామ ఉపాధ్యాయుడు వెంకటేష్‌ను సంప్రదించాలని తెలిపారు.

దసరా వచ్చిందయా..



బెల్లంపల్లి: తిలక్ స్టేడియంలో ఏర్పాటు చేసిన రావణాసురుని ప్రతిమ

- నేడు విజయదశమి
- శమీ చెట్టుకు పూజ ప్రత్యేకం

బెల్లంపల్లి/మంచిర్యాలఅర్బన్: ఆశ్వీయుజ శుద్ధ పాడ్యమి నుంచి ఆశ్వీయుజ శుద్ధ నవమి వరకు తొమ్మిది రోజులు దేవీ నవరాత్రి ఉత్సవాలు నిర్వహించిన భక్తులు పదో రోజు విజయదశమి నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. శక్తి ఆరాధనకు ప్రాధాన్యతనిచ్చే పండుగ దసరా. చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా విజయదశమి నిర్వహిస్తారు. శనివారం దసరా పండుగ నిర్వహించుకునేందుకు ప్రజలు సన్నద్ధమయ్యారు. ప్రత్యేక పూజల కోసం ఆలయాలు ముస్తాబయ్యాయి. విజయదశమి రోజున వాహనాల పూజలు, సామగ్రి కొనుగోలు చేస్తారు. ఇప్పటికే పలు దుకాణాల్లో రాయితీలు ప్రకటించారు. దసరా నేపథ్యంలో దుకాణాలు కళకళలాడుతున్నాయి.

మంచిర్యాలలో 58ఏళ్లుగా..

దసరా ఉత్సవాల్లో భాగంగా ఆనవాయితీ ప్రకారం 58 ఏళ్లకుపైగా స్థానిక విశ్వనాథ ఆలయం నుంచి ఉత్సవ దేవతామూర్తులతో స్థానిక గోదావరి నది తీరాన గౌతమేశ్వర ఆలయం వరకు శోభాయాత్ర నిర్వహిస్తారు. శ్రీదేవి, భూదేవి సహిత వేంకటేశ్వరస్వామి, పార్వతీపరమేశ్వరుల ఉత్సవ విగ్రహాలతో పట్టణ వీధుల మీదుగా శోభాయాత్ర సాగుతుంది. గౌతమేశ్వర ఆలయ ఆవరణలోని శమీ(జంబి) వృక్షానికి వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య ప్రజల సమక్షంలో పూజలు నిర్వహిస్తారు. జంబి ఇచ్చిపుచ్చుకుంటూ దసరా శుభాకాంక్షలు తెలియజేస్తారు. మొదట్లో విశ్వనాథ ఆలయం నుంచి గర్మిళ్ల ఆంజనేయస్వామి ఆలయం వరకు బోయలు దేవతామూర్తుల పల్లకిసేవ చేసేవారు. కాలక్రమంలో అక్కడి నుంచి గోదావరి నది ఒడ్డున ఉన్న గౌతమేశ్వర ఆలయం ఆవరణలోని శమీ చెట్టు వరకు ట్రాక్టర్లపై దేవతామూర్తుల శోభాయాత్ర జరుగుతోంది. పూజల అనంతరం పురపాలక సంఘం కార్యాలయం మీదుగా విశ్వనాథ ఆలయం వరకు రథోత్సవం నిర్వహిస్తామని ఆలయ ఈవో ముక్తా రవి తెలిపారు.



గౌతమేశ్వర ఆలయం

బెల్లంపల్లిలో..

దసరా ఉత్సవాల్లో భాగంగా రావణాసుర వధ కార్యక్రమాన్ని కన్నుల పండువగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. దసరా వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. శనివారం బెల్లంపల్లి పట్టణంలోని సింగరేణి తిలక్ స్టేడియంలో రావణాసుర బొమ్మ దహనానికి హిందు ఉత్స వ సమితి ఏర్పాట్లలో నిమగ్నమైంది. వేలాది మంది ప్రజలు ఈ ఘట్టాన్ని తిలకించడానికి తరలివస్తారు. స్టేడియంలో విద్యుత్ దీపాలు అమర్చారు. రావణాసుర వధ జరిగే ప్రాంతం వరకు ప్రజలు వెళ్లకుండా బారికేడ్లు ఏర్పాటు చేశారు.

జంబి చెట్టును దర్శించుకుని..

దసరా పండుగలో భాగంగా జంబి చెట్టును దర్శించుకుని ఆకులు తెంపుకొని కుటుంబ సభ్యులు, బంధువులు, ఆత్మీయులకు అందజేసి ఆలింగనం చేసుకుంటూ పరస్పర శుభాకాంక్షలు తెలియజేసుకుంటారు. సాయంత్రం ఏడు గంటలకు తిలక్ స్టేడియంకు చేరుకుంటారు. ముఖ్య అతిథుల ఉపన్యాసాల తర్వాత రాత్రి 9గంటలకు టపాసులతో రావణాసుర ప్రతిమను కాలుస్తారు. బెల్లంపల్లి రైల్వేస్టేషన్ ఏరియాలోనూ దసరా వే డుకలను ఘనంగా నిర్వహిస్తారు. రావణాసురుడి ప్రతి మను దహనం చేసే కార్యక్రమాన్ని రైల్వే అధికారులు, స్థానికులు, రైల్వే కార్మికులు యేటా నిర్వహిస్తుంటారు.

ఇసుక అక్రమ రవాణాపై కఠిన చర్యలు



ఇసుక క్వారీ వద్ద కలెక్టర్ కుమార్ దీపక్

కోటపల్లి: ఇసుక అక్రమ రవాణాపై కఠినచర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం మండలంలోని కొల్లూర్‌లో ఇసుక రీచ్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ ప్రజల సౌకర్యార్థం ప్రభుత్వం జిల్లాలో అధికారికంగా ఇసుక రీచ్ పాయింట్లను ఏర్పాటు చేసిందని తెలిపారు. వెబ్‌సైట్‌లో బుక్ చేసుకున్న వినియోగదారులకు నేరుగా సరఫరా చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇసుక క్వారీల సిబ్బంది పాల్గొన్నారు.

గనుల ఏర్పాటుకు ప్రభుత్వం ప్రణాళిక



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేక్

మందమర్రిరూరల్: సింగరేణి ఉజ్వల భవిష్యత్, వివిధ రంగాల్లో విస్తరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎంతగానో ఆలోచిస్తోందని, నూతన బొగ్గు గనుల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందిస్తోందని, తద్వారా కొత్త ఉద్యోగాల కల్పన సాధ్యమవుతుందని చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి అన్నారు. 'ఉజ్వల సింగరేణి–ఉద్యోగుల పాత్ర' అనే అంశంపై మందమర్రి ఏరియాలోని గనులు, డిపార్ట్‌మెంట్లపై శుక్రవారం అవగాహన కల్పించారు. కేకే-5 గనిపై నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి మాట్లాడుతూ బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకత విషయంలో పొదుపు పాటించాల్సిన అవసరం ఉందని, ఉద్యోగులు సమయ పాలన పాటిస్తే సంస్థకు మరింత లాభాలు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. కాంట్రాక్టర్ కార్మికులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లాభాల్లో వాటా కింద రూ.5 వేలు అందించడం చరిత్రాత్మక నిర్ణయమని అన్నారు. మధ్యాహ్నం గనులు, డిపార్ట్‌మెంట్లపై జీఎం దేవేందర్ ఆధ్వర్యంలో ఉద్యోగులు, సిబ్బందికి విందు భోజనం ఏర్పాటు చేశారు. కేకే-5 గని ఆవరణలో ఏర్పాటు చేసిన సహపంక్తి విందు భోజనంలో పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ కార్మికులతో కలసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఏరియా అధికారులు, గుర్తింపు, ప్రాతినిధ్య కార్మిక సంఘాల నేతలు, ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య

- పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ
- ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి శంకుస్థాపన



చెన్నూర్: శంకుస్థాపన చేస్తున్న ఎంపీ వంశీకృష్ణ, ఎమ్మెల్యే వివేక్



శిలాఫలకం ఆవిష్కరణలో ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు, కలెక్టర్ కుమార్ దీపక్

చెన్నూర్‌రూరల్: స్వంత పాఠశాల భవనాల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ అన్నారు. మండలంలోని సోమనపల్లి గ్రామంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ భవన నిర్మాణానికి శుక్రవారం ఎమ్మెల్యే గడ్డం వివేక్, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌లతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీ వంశీకృష్ణ మాట్లాడుతూ సమీకృత గురుకుల పాఠశాల సముదాయ భవన నిర్మాణానికి 25ఎకరాలు కేటాయించినట్లు తెలిపారు. ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ద్వారా తాగునీరు, విద్యుత్, మూత్రశాలలు, వంటశాల, అదనపు తరగతి గదులు, ప్రహరీ ఇతర అన్ని సౌకర్యాలతో కూడిన నాణ్యమైన విద్యను అందించేందుకు చర్యలు తీసుకుంటోందని తెలిపారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ గురుకుల పాఠశాలల్లో ఎలాంటి కుల, మత, వర్గ విభేదాలు లేకుండా విద్యార్థులందరికీ సమానమైన విద్య అందిస్తామని అన్నారు. విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకున్నప్పుడు తాము చదివిన పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మల్లికార్జున్, ఆర్అండ్‌బీ డీఈ భవేశ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

అందరికీ ఒకే చోట

దండేపల్లి: అన్ని సామాజిక వర్గాలకు ఒకేచోట నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టిందని జిల్లా కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. దండేపల్లి మండలం రెబ్బనపల్లి సమీపంలో 22 ఎకరాల విస్తీర్ణంలో సుమారు రూ.175 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావుతో కలిసి శుక్రవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం, విద్య, వైద్యానికి ప్రాధాన్యత ఇస్తూ, అభివృద్ధికి నిధులు కేటాయిస్తోందని చెప్పారు. ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలుపుతానని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో సమస్యల పరిష్కారానికి నిధుల మంజూరుతోపాటు పనులు చేశామని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిరిజన సహకార చైర్మన్ కోట్నాక తిరుపతి, డీసీసీ అధ్యక్షురాలు సురేఖ, తహసీల్దార్ సంధ్యారాణి, డీఆర్‌డీవో కిషన్, ఆర్అండ్‌బీ డీఈ రమేష్, ఎంపీడీవో ప్రసాద్, ఏఎంసీ చైర్మన్ ప్రేంచంద్, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ధరణి ఆపరేటర్ల వేతన వెతలు

- ఎనిమిది నెలలుగా పెండింగ్
- జిల్లాలో 20 మంది ఆపరేటర్లు



హాజీపూర్ తహసీల్దార్ శ్రీనివాసరావు దేశ్‌పాండేకు వినతిపత్రం అందజేస్తున్న ఆపరేటర్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): జిల్లాలోని తహసీల్దార్ కార్యాలయాల్లో ధరణి ఆపరేటర్లు వేతనాలు అందక అవస్థలు పడుతున్నారు. వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్లు, ఆన్‌లైన్ రికార్డుల నమోదు తదితర ధరణి సేవలు అందిస్తున్నారు. థర్డ్ పార్టీ ఏజెన్సీ ద్వారా నియామకం అయిన నాటి నుంచి వస్తున్న అరకొర జీతాలతో వీరి జీవితాలు అగమ్యగోచరంగానే సాగుతున్నాయి. జీఓ 63 ప్రకారం ఆపరేటర్‌కు రూ.31,040 వేతనం చెల్లించేలా చూడాలని, పీఎఫ్, ఈఎస్ఐ వర్తింపజేయాలని, ప్రధానంగా ఉద్యోగ భద్రత కల్పించాలని, థర్డ్ పార్టీ ఏజెన్సీ ద్వారా కాకుండా ప్రభుత్వం నేరుగా జీతాలు ఇచ్చేలా చూడాలని కోరుతున్నారు.

ఎనిమిది నెలలుగా..

ధరణి ఆపరేటర్లకు ఎనిమిది నెలలుగా వేతనాల చెల్లింపులు నిలిచిపోయాయి. రాష్ట్ర వ్యాప్తంగా సమస్య ఉండడంతో జిల్లా వ్యాప్తంగా ఉన్న 20 మంది అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వ ఖజానా నుంచి ఒక్కో ఆపరేటర్‌కు రూ.29,500 వేతనం చెల్లిస్తుండగా ఏజెన్సీ మాత్రం రూ.12,031 మాత్రమే చెల్లిస్తోంది. గతంలో రెండు, మూడు నెలలకోసారి వేతనాలు అందాయి. ప్రస్తుతం ఏడు నెలలుగా వేతనాలు రాలేదని పేర్కొంటూ శ్రమ దోపిడీకి గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భూ రిజిస్ట్రేషన్ల ద్వారా ప్రభుత్వ ఖజానాకు పెద్ద మొత్తంలో ఆదాయం తీసుకువచ్చే ధరణిలో భాగస్వామ్యమైన తమకు ప్రతీ నెల వేతనాలు అందేలా ప్రభుత్వం, అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

ప్రతీ నెల అందేలా చూడాలి

ఆపరేటర్లకు ప్రతీ నెల వేతనాలు అందించేలా చూడాలి. ఎనిమిది నెలలుగా వేతనాలు రాక కుటుంబ పోషణ భారంగా మారింది. పండుగ వేళ అప్పులు తీసుకువచ్చి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. దసరా, దీపావళి పండుగల వేళ జీతాలు రాక కుటుంబాల్లో ఆవేదన తప్ప సంతోషాలు కరువయ్యాయి. అధికారులు స్పందించి వేతనాలు ఇప్పించాలి.

– దుగుట దుర్గాప్రసాద్, ధరణి ఆపరేటర్, హాజీపూర్

క్లుప్తంగా

దొంగతనం కేసులో ఒకరి రిమాండ్



మాట్లాడుతున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి

ఆదిలాబాద్‌రూరల్: సూపర్‌మార్కెట్‌లో చోరీకి పాల్పడ్డ నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ జీవన్‌రెడ్డి తెలిపారు. మావల పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఇచ్చోడ మండలం సుంకిడి గ్రామానికి చెందిన చౌహాన్ సుప్రభాత్ ఆదిలాబాద్ పట్టణంలోని అటెండర్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. దస్నాపూర్ కాలనీలోగల సాగర్ సూపర్ మార్కెట్‌లో ఐదేళ్లుగా గోడౌన్ ఇన్‌చార్జిగా పని చేస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఈ నెల 6న షాపులోని మెట్ల కింద దాగి ఉన్నాడు. యాజమాని దుకాణం మూసి వెళ్లిన తర్వాత అర్ధరాత్రి కౌంటర్లలోని రూ.3.05 లక్షలు తీసుకున్నాడు. లిఫ్ట్‌ద్వారా స్లాబ్ పైకి వెళ్లి పైపు సాయంతో కిందికి దిగి వెళ్లిపోయాడు. 7న ఉదయం యజమాని తాళం తీసి పరిశీలించగా నగదు కనిపించలేదు. యజమాని ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నిందితుడు అప్పు చెల్లించేందుకు వెళ్తుండగా పట్టుకున్నారు. నగదు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ పేర్కొన్నారు. రూరల్ సీఐ ఫణిందర్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, మావల ఎస్సై విష్ణువర్ధన్‌లను ఎస్పీ గౌస్ ఆలం అభినందించారు.

రూ.10.. పరేషాన్..!

- మార్కెట్లో తగ్గిన కరెన్సీ నోట్ల చెలామణి
- ఇబ్బందుల్లో వ్యాపారులు, ప్రజలు



పది రూపాయల కరెన్సీ నోటు

నెన్నెల: మార్కెట్లో రూ.10 నోటు కనిపించడం గగనంగా మారింది. దీంతో అటు వ్యాపారులు.. ఇటు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. సాధారణ కొనుగోళ్లకు 1, 2, 5, 10 రూపాయల నాణేలు గతంలో చాలా చెలామణిలో ఉండేవి. ధరల పెరుగుదల కారణంగా 1, 2, 5రూపాయల నాణేలు ఉన్నా 5, 10రూపాయల నాణేల వినియోగం పెరిగింది. ప్రస్తుతం ఆయా నాణేలతోపాటు రూ.10 నోట్ల చెలామణి కూడా భారీగా తగ్గింది. వ్యాపారులు ఏదైనా వస్తువు విలువ చెప్పేటప్పుడు రూ.5కు రెండు, రూ.10కి మూడు అని చెబుతున్నారు. దీంతో కిరాణ, ఫ్యాన్సీ, కూరగాయలు, బస్సు, ఆటో చార్జీల్లో రూ.10 కరెన్సీ నోటుకు ప్రాధాన్యం పెరిగింది. ప్రస్తుతం రూ.10 నోటు మార్కెట్‌లో అందుబాటులో లేక వ్యాపారులు ఇక్కట్లకు గురవుతున్నారు.

ఆన్‌లైన్ చెల్లింపులు

కరోనా తర్వాత డిజిటల్ చెల్లింపులు పెరిగాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహిస్తున్నాయి. దీంతో అన్ని వర్గాల ప్రజలు ఆన్‌లైన్ చెల్లింపులకు అలవాటుపడ్డారు. ఏ దుకాణానికి వెళ్లినా, ఏ వస్తువు కొనుగోలు చేయాలన్నా డిజిటల్ చెల్లింపులు అనే పరిస్థితి నెలకొంది. వీధి వ్యాపారులు, చిన్న దుకాణాల్లో, చిన్నపాటి చెల్లింపులకు ఫోన్‌పే, గూగుల్‌పే వంటివి ప్రత్యేకంగా వ్యాలెట్ రూపంలో సులభతర చెల్లింపులకు అనుమతిస్తున్నారు. దీంతో రూ.5, రూ.10 లావాదేవీలకు కూడా వినియోగదారులు నోట్లు ఇవ్వడం లేదు. క్రమంగా రూ.10 నోటు బదలాయింపు జరగకపోవడం వల్ల వ్యాపారులు, వినియోగదారుల వద్ద అందుబాటులో లేకుండా పోయింది. మార్కెట్‌లో ప్రస్తుతం చిరిగిన రూ.10 నోట్లు దర్శనమిస్తుండడం గమనార్హం.

ఎక్కడ ఆగిందో..?

రూ.10 నోటు మార్కెట్‌లో చెలామణి తగ్గడంలో అసలు సమస్య ఎక్కడ ఉత్పన్నమైందో అర్థం కాని పరిస్థితి ఏర్పడింది. వ్యాపారులు సైతం ఈ పరిస్థితిపై ఓ అంచనాకు రాలేకపోతున్నారు. వినియోగదారులు చిరు వ్యాపారుల వద్ద వస్తువులు కొనుగోలు చేసినప్పుడు రూ.100 నోటు ఇస్తే వ్యాపారులు తిరిగి ఇవ్వాల్సిన చిల్లరకు నానా అవస్థలు పడుతున్నారు. గతంలో రూ.1, రూ.2 చెల్లింపులకు బదులుగా చాక్లెట్లు, బిస్కెట్లు వంటివి ఇచ్చేవారు. కానీ రూ.10లకు ఏమి ఇవ్వాలని వ్యాపారులు ఆలోచనలో పడ్డారు. ఇస్తే వినియోగదారుడు ఎలా స్పందిస్తారనే ఆందోళన వారిలో నెలకొంది. భారీ మొత్తాల చెల్లింపుల విషయంలో పరిస్థితి భిన్నంగా ఉంది. పెద్ద మొత్తంలో లావాదేవీలకు డిజిటల్ చెల్లింపులు జరిగితే వినియోగదారులు, వ్యాపారులు పన్నుల పరిధిలోకి వస్తామని ఆందోళన చెందుతుండడమే ఈ పరిస్థితికి కారణం. చిన్నమొత్తాల చెల్లింపుల కారణంగా కొన్నిసార్లు యూపీఐ సర్వర్‌లపై భారం పడి పని చేయని పరిస్థితి నెలకొంటోందని వ్యాపారులు చెబుతున్నారు.

నోట్ల కొరత వాస్తవమే

రూ.10 నోట్ల కొరత ఉన్న మాట వాస్తవమే. రిజర్వు బ్యాంకు నుంచి రావడం లేదు. రూ.20, రూ.50, రూ.100 నోట్లు మాత్రమే వస్తున్నాయి. రూ.10 నోట్లు రావడం లేదు. నాణేలు మాత్రం అందుబాటులో ఉన్నాయి. అవి చెల్లుబాటులో ఉన్నాయని ప్రజలు గమనించాలి.

– గోపీకృష్ణ,
తెలంగాణ గ్రామీణ బ్యాంకు
మేనేజర్, ఆవుడం

సవాళ్లను ఎదుర్కోవాలి



మాట్లాడుతున్న జీఎం సంజీవరెడ్డి

శ్రీరాంపూర్: రాబోయే కాలంలో సంస్థ సవాళ్లను ఎదుర్కోవాల్సి ఉందని శ్రీరాంపూర్ జీఎం బీ.సంజీవరెడ్డి అన్నారు. శుక్రవారం జీఎం కార్యాలయం, ఆర్కే 6 గని, ఆర్కే 7గని, ఎస్సార్పీ 3 గనులపై 'ఉజ్వల సింగరేణి–ఉద్యోగుల పాత్ర' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ సింగరేణి మార్కెట్ పోటీని తట్టుకుని నిలబడాలంటే ఉత్పత్తి ఖర్చు తగ్గించుకోవాలని అన్నారు. భూగర్భ గనుల్లో బొగ్గు ఉత్పత్తి ఖర్చు అమ్మకం కంటే రెండింతలు ఉంటుందని తెలిపారు. ఇతర కంపెనీల బొగ్గు తక్కువ ధరకు మార్కెట్‌లో లభ్యం అవుతోందని అన్నారు. ఉత్పత్తి ఖర్చు తగ్గించుకోవడం కోసం యంత్రాల పని గంటలు పెంచాలని తెలిపారు. మానవ వనరులను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. సంస్థ ఉత్పత్తి లక్ష్యాలు, ఆర్థిక స్థితిగతులను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం కార్మికులకు విందు భోజనాలు ఏర్పాటు చేశారు. ఆయా గనులపై వేర్వేరుగా జరిగిన కార్యక్రమాల్లో గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచి సెక్రెటరి ఎస్కే బాజీసైదా, అధికారుల సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, ఏజీఎం(ఫైనాన్స్) మురళీధర్, ఏజెంట్ గోపాల్‌సింగ్, శ్రీధర్, డీజీఎంలు చంద్రలింగం, గనుల మేనేజర్లు ఈ.తిరుపతి, వెంకటేశ్వర్లు, ఇంచార్జి డీజీఎం రాజేశ్వర్‌రావు పాల్గొన్నారు.

కొత్త పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేక్

జైపూర్: సింగరేణి అధికారులు, ఉద్యోగులు కొత్త పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ సంస్థకు మరింత లాభాలు వచ్చే విధంగా కృషి చేయాలని చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి అన్నారు. శుక్రవారం జైపూర్‌లోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్, ఇందారం, ఓసీపీ అధికారులతో కలిసి సందర్శించారు. 'ఉజ్వల సింగరేణి–ఉద్యోగుల పాత్ర' కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఐకే–1ఏ గనిపై నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీ వంశీకృష్ణ, చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి పాల్గొన్నారు. డీ.రాజశేఖర్‌రావు, ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, జీఎంలు శ్రీనివాసులు, సంజీవరెడ్డి, ఓఅండ్ఎం జైసింగ్ పాల్గొన్నారు.

దాడి కేసుల్లో ఎనిమిది మంది అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ బన్సిలాల్

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని హమాలీవాడ, సప్తగిరికాలనీ, అశోక్ రోడ్‌లో దాడులకు దిగిన ఎనిమిది మంది వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పట్టణ సీఐ బన్సిలాల్ తెలిపారు. శుక్రవారం రాత్రి స్థానిక పోలీసుస్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. చర్చి సమీపంలో మహిళలు బతుకమ్మ ఆడుతుండగా శ్రావణ్, వంశీలపై మద్యంమత్తులో శరత్, సురేష్, అనిరుధ్, అఖిల్ మరికొందరు దాడి చేశారని తెలిపారు. సప్తగిరికాలనీలో ప్రేమ వ్యవహారానికి సంబంధించి తోట తిరుపతిపై అగ్గు మారుతితోపాటు మరి కొందరు దాడి చేశారని పేర్కొన్నారు. అశోక్‌రోడ్‌లో అప్పు వ్యవహారానికి సంబంధించి కోపం పెంచుకుని సోహెల్‌పై రాజు, శ్రావణ్, చిలుక సాయి మరి కొందరు మద్యంమత్తులో దాడిచేసి అతడి కారు అద్దం ధ్వంసం చేశారని తెలిపారు. ఈ మూడు కేసుల్లో బాధితుల ఫిర్యాదు మేరకు శరత్, సురేష్, అనిరుధ్, అఖిల్, మారుతి, రాజు, శ్రావణ్, సాయిలను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. పండుగ పూట మద్యంమత్తులో, పాత కక్షలను దృష్టిలో ఉంచుకుని దాడులకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు. ఈ సమవేశంలో ఎస్సైలు సనత్‌రెడ్డి, సురేష్ పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

మందమర్రిరూరల్: మందమర్రి పోలీస్‌స్టేషన్ పరిధిలోని చెత్లాపూర్ సమీపంలో పేకాట స్థావరంపై ఎస్సై రాజశేఖర్ శుక్రవారం తన సిబ్బందితో దాడి చేశారు. నీరటి శ్రీశైలం, పులి బానయ్య, కప్ప నర్సయ్య, బబ్బెర విజయ్, రత్నం వెంకటస్వామిలను అరెస్టు చేశారు. రూ.15,720 నగదు, ఐదు సెల్‌ఫోన్లు, ఐదు మోటార్ సైకిళ్లు స్వాధీనం చేసుకున్నారు.

కొండచిలువ హతం

కుంటాల: మండలంలోని ఓలా శివారులో వ్యవసాయ పనులు చేస్తుండగా కనిపించిన కొండచిలువను రైతులు శుక్రవారం హతమార్చారు. కుంటాలకు చెందిన గొల్ల నవీన్, ఒడ్నం రమేశ్ సోయా పంట నూర్పిడి చేసే క్రమంలో పిచ్చిమొక్కలు తొలగిస్తున్నారు. వారికి కొండచిలువ కనిపించింది. వెంటనే దాన్ని హతమార్చారు. కొండచిలువ సుమారు 7 ఫీట్ల ఎత్తు, 15 కిలోల బరువు ఉందని రైతులు తెలిపారు.